

# మగాడి తోడు

నాయపతి కమలా రాంజీ

**"హలో కవితా! ఎంతసేపైంది వచ్చి? రా కూర్చో"**

**దేవకి సీరియస్‌గా మిషన్ మీద బట్టలు కుడుతోంది.**

"నేను ఐదు నిముషాలైందే వచ్చి. నువ్వు మిషన్ మీద బట్టలు కుడుతూ నన్ను గమనించలేదు." అంటూ దేవకి పక్కనున్న కుర్చీలో కూర్చున్నాను. దేవకి బి.ఏ. లో నా క్లాస్‌మేట్. మేం అప్పట్లో చాలా క్లోజ్‌గా వుండేవాళ్ళం. పెళ్ళిళ్ళయి ఎవరి సంసారాల్లో వాళ్ళు పడ్డాక ఏదో ఇలా అప్పుడప్పుడూ కల్సుకుంటూ వుంటాం. "దేవకి కంటే నేను ఆర్థికంగా బాగానే వున్నాను. ఆమెకి సహాయం చెయ్యగల స్థితిలో వున్నాను. ఏదైనా సహాయం చేస్తే బాగుంటుంది" అని నేను ఎన్నో సార్లు అనుకున్నాను. మా వారు బ్యాంకు మేనేజరు. ఆస్తి, అంతస్తుతో పాటు ఆత్మీయతానురాగాలకి అర్థం తెల్సిన వ్యక్తి. ఎప్పుడూ ఎవరి మనసూ నొప్పించకుండా మసులుకునే మనస్తత్వం అతనిది. నేను దేవకికి పెద్దగా సహాయం ఏదీ చెయ్యక పోయినా స్కూల్లో టీచరుగా ఉద్యోగం వేయించాను. దేవకి కుట్టు మిషను కొనుక్కోవడానికి మా ఆయనకి చెప్పి బ్యాంకులో లోను ఇప్పించాను. ప్రతీనెలా ఖచ్చితంగా లోను ఇన్‌స్టాల్‌మెంటు కట్టేస్తుంది దేవకి. ఎవరిచేతా మాట పడే రకం కాదు అది. ఆ మాత్రం సహాయానికే, నేను వచ్చినప్పుడల్లా తనకి ఉద్యోగం వేయించినందుకు, తన చేత కుట్టుమిషను కొనిపించి బ్రతుకు తెరువు చూపించినందుకు కృతజ్ఞతలు చెప్తూనే వుంటుంది. "స్నేహితురాళ్ళ మధ్య కృతజ్ఞతలేంటే?" అంటాను నేను.

రోజూ స్కూలుకెళ్ళి పిల్లలకి పాఠాలు చెప్పడం, ఇంటికొచ్చాక స్టూడెంట్స్ హోమ్‌వర్క్ పుస్తకాలు దిద్దడం, వంట పన్లు, ఇంటి పన్లు, బజారు పనులతోపాటు తన పిల్లలిద్దర్నీ చదివించడం చేస్తుంది. అంతేకాక కుట్టు మిషన్ మీద చుట్టుపక్కల అందరికీ జాకెట్లు, చూడీదార్లు, చీరల ఫాల్స్ కుట్టడం కూడా చేస్తుంది. ఎంతో కష్టపడి డబ్బు సంపాదించి పిల్లల్ని పోషించుకుంటున్నది. ఎవరి జోలికీ వెళ్ళదు. ఎవరి విషయాల్లోనూ తల దూర్చదు. ఇరుగుపొరుగు ఇళ్ళక్కూడా వెళ్ళదు. తన పనేదో తనది అన్నట్టుగా వుంటుంది.

దేవకి భర్త త్రాగుడికి అలవాటు పడ్డాడు. పగలు రాత్రి తాగుతూ కూర్చునేవాడు. మంచి భోజన ప్రియుడు. బాగా తినడం, తాగడం అలవాటయిపోయిన రాంబాబు ఆరోగ్యం దెబ్బతింది. అతని లివరు పూర్తిగా పాడయిపోయింది. దేవకి, భర్తని హాస్పిటల్లో జాయిన్ చేసి చాలా డబ్బు ఖర్చుపెట్టింది. ఆఖరికి తన మంగళసూత్రం కూడా అమ్మేసి, ఆ వచ్చిన డబ్బుతో మందులు, ఇంజక్షన్లు కొన్నది. అయినా ఫలితం లేకపోయింది. భర్త పోయినప్పుడు ఆమె బాగా ఏడ్చింది. ఏడ్చి ఏడ్చి ఆమె కళ్ళు కప్పల్లా అయిపోయాయి. ఎంత ఏడ్చినా పోయినవాళ్ళు తిరిగి రారన్న సత్యాన్ని జీర్ణం చేసుకుని ఆఖరికి గుండెని రాయి చేసుకుని ఉద్యోగంలో చేరింది. అదుగో అప్పట్నుంచి స్కూలు, ఇల్లు.. ఆ గానుగెద్దు జీవితం తప్పలేదు ఆమెకి.

"భర్త పోయిన ఆడది మగతోడు లేకుండా ఒంటరిగా వుండడం కష్టం అంటావా కవితా?" కుట్టడం ఆపి ఇటు తిరిగి అంది.

"ఏమైందే ఇప్పుడు నీకు? నీకేమైనా కష్టం వచ్చిందా?" కంగారుగా అడిగాను.

"ఏం లేదు. ఈ మధ్య జరిగిన సంఘటన వింటే నేనన్న మాటని నువ్వు కూడా ఒప్పుకుంటావేమో! నా భర్త జాండీసు వచ్చి పోయాడని నీకు తెలుసు. అతను పోయాక ఏదో నీ దయవల్ల చిన్న ఉద్యోగం చేసుకుంటూ ఇద్దరాడపిల్లల్ని కష్టపడి చదివించుకుంటూ ఏదో నా మానాన నేను బ్రతుకుతున్నాను. పిల్లలిద్దర్నీ రెండు కళ్ళులాగ చూసుకుంటూ నా శక్తి మేరకు వాళ్ళని పెంచుకుంటున్నాను. ఇన్నాళ్ళకి వాళ్ళిద్దరూ కాలేజీకి వచ్చారు. పెద్దది అంజలి ఇంటర్ సెకండియర్ కొచ్చింది. చిన్నది దివ్య ఇంటర్ ఫస్టియర్ కొచ్చింది."

"అవును, ఇవన్నీ నాకు తెల్సిన విషయాలే కదా! ఈ రోజు ప్రత్యేకంగా ఎందుకు చెప్తున్నట్టు?" అర్థం కానట్టు మొహం పెట్టి అడిగాను.

"నా సంగతి నా స్వభావం నీకు పూర్తిగా తెల్సుకదా! ఎవరైనా నన్ను పలకరించి మాట్లాడినా నేను జాగ్రత్తగానే మసులుకుంటాను. అరిటాకు మీద ముల్లు పడినా, ముల్లు వచ్చి అరిటాకు మీద పడినా, అరిటాకుకే నష్టం అని నాకూ తెల్సు. అందుకే ఎంతో అవసరం వుంటే తప్ప ఏ మగాడితోనూ మాట్లాడను."

"అబ్బ ఈ ఉపోద్ఘాతం అంతా ఎందుకే? అసలేం జరిగిందో చెప్పు?" దానికొచ్చిన కష్టం ఏమిటో తెలుసుకోవాలన్న ఆతృత నాలో పెరిగిపోతున్నది.

"మా రెండో బావగారు నీకు తెల్సు కదా!"

"ఏం ఆయనేమన్నా వెకిలిగా బిహేవ్ చేశారా?" నేనన్నాను.

"లేదే. పాపం ఆయన చాలా మంచివారు. అతని తోడల్లుడు (అంటే అతని భార్యకి అక్క మొగుడు) పార్వతీశం అని వున్నాడు. అతనికి

ఉద్యోగం లేదని, ఏదన్నా ఉద్యోగం వేయించమని మా బావగారి దగ్గరకొచ్చి అడిగేదట అతని భార్య. పోనీ తోడల్లుడే కదా అని తెలిసినవాళ్ళని ఎవరినో బ్రతిమాలి ఒక ఉద్యోగం వేయించారు మా బావగారు. ఆ ఉద్యోగం అయినా రెగ్యులర్‌గా వెళ్ళి కష్టపడి చేసుకోవచ్చు కదా. ఉద్యోగానికి ఒకరోజు వెళ్తాడు, ఒక రోజు వెళ్ళడు. ఈ మధ్య రోజూ నేను ఇంట్లో వున్న సమయంలో మా ఇంటికి రావడం మొదలెట్టాడు. అంతేకాదు, "మీ పిల్లలూ మా పిల్లలూ ఒకటే. మా ఆవిడా మీరూ ఒకటే. రమ జబ్బు మనిషి అయిపోయింది. ఎప్పుడూ మంచం మీద పడుకునే వుంటోంది. ఓ అచ్చటా లేదు, ముచ్చటా లేదు. ఇంటి పని, వంట పని, పిల్లల విషయం ఏమీ పట్టించుకోదు. అలాంటి దానితో నాకు.. ఏం సుఖం వుంటుంది చెప్పండి? ఏమిటో మిమ్మల్ని చూస్తూంటే జన్మజన్మల నుండి మనిద్దరి మధ్యా ఏదో సంబంధం వుందని నాకనిపిస్తోంది. మీకేం అనిపిస్తోంది?" అంటూ మాటి మాటికీ వచ్చి అనడం మొదలెట్టాడు.

"నాకేమనిపిస్తుంది? మిమ్మల్ని నాలుగు తన్నాలనిపిస్తోంది. మెడ పట్టి బయటకు గెంటాలనిపిస్తోంది" అందామని నాలుక చివరి దాకా వచ్చింది. కానీ అనలేకపోయాను.

ఒకరోజు మా బావగారొచ్చారు మా ఇంటికి. అప్పుడు పార్వతీశం మా ఇంట్లోనే వున్నాడు.

పార్వతీశం వైపు, నా వైపు ఎగాదిగా చూశారు అతను. ఆ చూపులు నాకు ముళ్ళలాగ గుచ్చుకున్నాయి. ఏ నేరం చెయ్యకపోయినా దోషిలా తల వంచుకున్నాను.

"ఇక్కడేం చేస్తున్నావు? ఆసలిక్కడికెందుకొచ్చావు?" అని నెమ్మదిగానే అడిగారు మా బావగారు.

"నువ్వెందుకొచ్చావో నేనూ అందుకే వచ్చాను" అన్నాడు పార్వతీశం ఏమాత్రం తడుముకోకుండా.

బావగారు అప్పటికి వూరుకున్నారు.

అంజలి, దివ్య ఇద్దరూ ఈడొచ్చిన అమ్మాయిలు. వాళ్ళకి పార్వతీశం ప్రవర్తన, అతని చూపులు, అతని మాటలు అన్నీ తెలుస్తూనే వున్నాయి. మా దివ్య చాలా చురుకైనది. ఈ రోజుల్లో ఏమీ తెలియనివాళ్ళక్కూడా సినిమాలు, టి.వి. లు పుణ్యమా అని అన్నీ తెలిసిపోతున్నాయి. దివ్య పార్వతీశం వచ్చిన దగ్గర్నుంచి అతన్నే గమనించడం మొదలు పెట్టింది. ఒక రోజు అతను వెళ్ళిపోయాక అడిగింది నన్ను.

"అమ్మా! అతని చూపు, అతని వాలకం అన్నీ అదోలా వున్నాయి. అతను నీతో అంత చనువుగా మాట్లాడ్డం ఎందుకు? అతనికీ మనకీ ఏమీ సంబంధం లేదు. అతను మనింటికి ఎందుకు రావాలి? అసలు నువ్వెందుకు అతన్ని మనింటికి రానిస్తున్నావు?" అని నిలదీసింది.

నేనేం మాట్లాడాలో దివ్యకి ఏం జవాబు చెప్పాలో తెలియలేదు. స్వతహాగా పిరికిదానిని. ఎవరినీ ఎదురించలేని మనస్తత్వం నాది. కూతురు అలా నిలదీసి అడిగేసరికి నాకు ఎందుకో ఏడుపొచ్చింది.

"నన్నేం చెయ్యమంటావే? ఇంటికొచ్చిన వాడ్ని రావద్దని ఎలా అంటాం? మీ పెదనాన్న తరఫు బంధువు. పైగా అతను మగాడు. గట్టిగా మాట్లాడితే అతనికి కోపం వచ్చి మన ముగ్గురి మీదా కక్ష కట్టి ఏమైనా అల్లరి చెయ్యొచ్చు. అందుకే వూరుకుంటున్నాను" అన్నాను.

"ఎన్నాళ్ళు వూరుకుంటావు? అతను నిన్ను అదోలా చూడ్డం, నీకు దగ్గరగా వచ్చి అర్థం పర్థం లేని వాగుడు వాగడం .. ఇదంతా ఏమిటి? భయం భయం అని నువ్వు పిరికిగా నోర్మూసుకుని ఉంటే అతను ఇంకా రెచ్చిపోతాడు" అంది దివ్య కోపంగా.

నేను ఏడ్చేను. నేను ఏ తప్పూ చెయ్యకపోయినా, నా కూతురు నన్ను నిలదీస్తుంటే తల వంచుకోవల్సి వచ్చినందుకు సిగ్గనిపించింది. చిన్నదైనా అది చెప్పిందాంట్లో కూడా నిజం వుంది. అయితే నేను అతన్ని ఏమీ అనలేక కాదు. మొహం మీద అనేస్తే బాగుండదని, బంధుత్వాలు తెగిపోతాయేమో నని వూరుకుంటున్నాను. నేను వూరుకోవడంతో అతను ఇంకోలా అర్థం తీసుకుంటున్నాడేమో. నేనే అనవసరంగా భయపడుతున్నాను. అసలు అతనికీ మనకీ వున్న సంబంధం ఏమిటి? దివ్య చెప్పినట్టు ఈసారి వస్తే మొహం మీదే రావద్దని నిష్కర్షగా చెప్పేయాలి" అని మనసులో అనుకున్నాను.

మరొక రోజు వచ్చినప్పుడు అన్నాడు. "మీరు, రమా ఒకటే. రమ వల్ల నాకు సుఖం లేదు. ఎంతైనా ఉప్పు, కారం తింటున్న మనిషిని కదా! ఇంతకీ మీ ఆయన ఎప్పుడు పోయాడు? బాగా తాగి తాగి ఒళ్ళంతా గుల్లయిపోయిందట కదా! అతను పోయి ఎన్నాళ్ళయింది? పాపం మీరు అప్పట్నుంచి వంటరిగానే వుండిపోయేరన్నమాట. మిమ్మల్ని చూస్తే జాలేస్తున్నది నాకు. మీరు కాదండీ దురదృష్టవంతులు ఇంత అందాన్ని ఆస్వాదించకుండా వెళ్ళిపోయాడు చూడండి అతనూ దురదృష్టవంతుడు" అన్నాడు నా వైపు అదోలా చూసి వంకరగా నవ్వుతూ. అక్కడే అంజలి, దివ్య కూర్చున్నారు. దివ్య అతన్ని కొరకొరా చూడ్డం మొదలెట్టింది. నేను మాట్లాడకుండా వూరుకున్నాను. మనసులో మాత్రం అతని మీద చాలా కోపంగా వుంది.

మళ్ళీ రెండు రోజులకి పార్వతీశం వచ్చాడు. మళ్ళీ పాత పాటే మొదలెట్టాడు. "నాకు రమ ఎంతో, నువ్వూ అంతే. రమా, నువ్వూ ఒకటే నాకు" అన్నాడు. ఇన్నాళ్ళూ దివ్య వూరికినే గోరంతది కొండంత చేస్తున్నదేమో అనుకున్నాను. కానీ దివ్యకొచ్చిన అనుమానం నిజమవుతుందేమో అనిపించింది. ఎందుకంటే ఎప్పుడూ నన్ను "మీరు" అనేవాడల్లా "మీరు" లోంచి 'నువ్వు' లోకి దిగిపోయినప్పుడు తెల్లబోయి చూస్తూ వుండిపోయాను. దివ్య, అంజలి, పార్వతీశం వచ్చినప్పుడల్లా నాకు చెరో వైపు కూర్చోవడం మొదలు పెట్టారు.

"అంకుల్! మీరెందుకు రోజూ మా ఇంటికి వస్తున్నారు? ఆఫీసుకి వెళ్ళడం లేదా? లేదంటే మీరు చాలా సిన్సియర్‌గా ఉద్యోగం చెయ్యడం చూసి మిమ్మల్ని వాళ్ళే ఉద్యోగంలోంచి తీసేశారా?" చాలా అన్న పదాన్ని నొక్కి పలుకుతూ వ్యంగ్య ధోరణిలో నవ్వుతూ అంది దివ్య.


నాకు ఫక్కున నవ్వొచ్చింది. కానీ బలవంతాన నవ్వుని ఆపుకున్నాను.

"ఏం లేదు. మిమ్మల్ని చూడాలని రోజూ వస్తున్నాను. అంతే. నువ్వు నా కూతురులాంటి దానివి. మా పిల్లలొకటి మీరొకటి కాదు. అందరూ నా పిల్లలే"

"నేనెలా మీ పిల్లనవుతాను?" అంది దివ్య తపిమని. దివ్యకి వళ్ళు మండిపోతోంది పార్వతీశాన్ని చూస్తుంటే.

(మిగతా 30 వ పేజీలో చూడండి)

## జ్ఞాపకాల పోటీలు



చదరంగం ఛాంపియన్‌షిప్‌ల లాగానే జ్ఞాపకాల ఛాంపియన్‌షిప్ పోటీలు కూడా అమెరికాలో ప్రతియేటా జరుగుతాయి. ప్రపంచం మొత్తంలో 36 జ్ఞాపకాల గ్రాండ్ మాస్టర్లు ఉన్నారు. వీరిలో అధికంగా యూరప్‌కి చెందినవారే కావటం విశేషం. పోటీలలో 5 భాగాలుంటాయి. ప్రథమంగా 99 మనుషుల పేర్లు, వారి ముఖాలని 15 నిమిషాలు చూపిస్తారు. వాటిని జ్ఞాపకం పెట్టుకొని 20 నిమిషాలలో చెప్పాలి. తర్వాత 50 పంక్తులుండి, ఇప్పటిదాకా ప్రచురణ కాని ఒక పద్యం చదివి 15 నిముషాలలో దాన్ని అప్పచెప్పాలి. అలాగే గజిబిజిగా పేర్చిన పదాలు, నంబర్లూ చూసి జ్ఞాపకం పెట్టుకొని అప్పచెప్పాలి. ఆఖరిగా షఫుల్ చేసిన పేకముక్కలని చూసి వాటిని తిరిగి చెప్పాలి ఒక నిముషం లోపులో. ప్రతి మేధావికీ తనదైన పద్ధతి ఒకటి ఉన్నా అన్ని విధానాల్లో చివరికి ప్రతి పదం, కార్డు, నంబరు ఏదో ఒక సంఘటన లేక ఏదో తనకిష్టమైన మనిషి పేరుతోనో లేక వస్తువుతోనో సంబంధం కలిగి ఉండేలా చేసుకొని గుర్తు పెట్టుకోవటం జరుగుతుంది. గ్రీకు పద్యకర్త సిమొనిడెస్ క్రీ.పూ.477 సంవత్సరంలో ఈ పద్ధతి కనిపెట్టాడని రిసెర్చి పండితులు చెప్తారు. దరిమిలా రోమన్ జనరల్స్ తమ కింద పనిచేసే వేలాది సిపాయిల పేర్లు గుర్తుపెట్టుకోవటానికి ఈ పద్ధతిని ఉపయోగించేవారట. తరువాత 15-16 శతాబ్దాలలో ఎందరో స్కాలర్లు కూడా ఈ పద్ధతినే ఉపయోగించి వారు కనిపెట్టిన ఎన్నో అమూల్యమైన విషయాలను వరుసగా పేర్చి భద్రపరిచేవారట.

ఈ మధ్య జరిగిన అమెరికన్ పోటీలలో యూరప్‌కి చెందిన కుక్ 150 పదాలు 5 నిముషాలలో గుర్తుపెట్టుకొని వాటిని అప్పచెప్పి రికార్డు సృష్టించాడు. జర్మనీకి చెందిన అముసెస్ 45 సెకండ్లలో ఒక చీట్లపేక ముక్కలు మొత్తం గుర్తుంచుకొని అప్పచెప్పాడట. **- వి.కె. మోహన్**

## మగాడి తోడు కథ

(27 వ పేజీ తరువాయి భాగం)

"ఎందుక్కాదు. నువ్వు నా కూతురివే. నేను మిమ్మల్నందర్నీ చూడకుండా వుండలేకపోతున్నానురా. అందుకే రోజూ వచ్చేస్తున్నాను" అన్నాడు సిగ్గు లేకుండా నవ్వుతూ.

పార్వతీశం విషయం శృతిమించి రాగాన పడుతోందని తెలుసుకున్నాను. కాని ఎదురు జవాబు యివ్వడానికి, ఎదుర్కోవడానికి ధైర్యం సరిపోవడం లేదు. అంజలి అన్నింటికీ ఊరుకుంటుంది. పైకి తేలదు. మనసులోనే మధనపడుతుంది. కాని దివ్య అలా కాదు. అన్యాయం జరిగితే చూస్తూ వూరుకోదు. అటో ఇటో తేల్చేస్తుంది. ఎదిరిస్తుంది. విజయం సాధిస్తుంది.

చిన్నదైనా అది నన్ను తిట్టిపోసింది.

"అమ్మా! నీకేం తెలీదు. రోజులు మారిపోయేయి. కాలం మారిపోయింది. ఆడదాని జీవితంలో అప్పటికీ ఇప్పటికీ బాగామార్పు వచ్చింది. మునుపు ఆడది కష్టాలు కన్నీళ్ళు, బాధలు, సమస్యలు అన్నీ దిగమింగుకుని మనసులోనే మగ్గిపోయేది. ఎలాంటి చిదంబర రహస్యమైనా గుండె గుప్పెట్లో దాచుకుని జీవితాంతం ఏడవడమో లేకపోతే జీవితం చాలించుకోవడమో చేసేది. కానీ ఇప్పుడలా కాదమ్మా. ఆడది మగవాడి కల్లబొల్లి మాటలకి లొంగిపోవడం లేదు. ఆడదంటే అబల కాదు సబల అని నిరూపిస్తున్నారు నేటి స్త్రీలంతా. "ఆప్యాయత" ముసుగు కప్పుకుని, మంచి చెడ్డలను చూడకపోతే బాగుండదనే మిష పెట్టుకుని, మగ దక్షత లేని ఆడదాని ఇంట్లో దూరపు బంధుత్వం చెప్పుకుని దూరడం, తర్వాత ఆ ఆడదాన్ని అల్లరిపాలు చెయ్యడం అలవాటైపోయిన కొంతమంది మగవాళ్ళకి బాగా బుద్ధి చెప్పే రోజులు వచ్చాయి. అమ్మా నువ్వు ఈ పిరికి మనస్తత్వం మార్చుకోవాలి. రేపు ఏదన్నా జరగకూడనిది జరిగితే నీ చుట్టూ వున్నవాళ్ళకి ఏం సమాధానం చెబుతావు? ఆలోచించుకో" దివ్య పెద్ద క్లాసు తీసుకుంది. నేను స్కూల్లో టీచరుని. కానీ దివ్య మా ఇంట్లోనే టీచరు.

"ఇప్పుడేం చెయ్యమంటావు? నువ్వేది చెప్తే అది చేస్తాను. ముందు ఆ పార్వతీశం పీడ విరగడైతే చాలు" అన్నాను ఖచ్చితంగా.

ఇంత చిన్నపిల్లకి ఎన్ని తెలుసు? అది చెప్పిన దాంట్లో అంతా నిజం వుంది. దివ్య వాళ్ళక్కతో కలిసి ఏదో ప్లాన్ వేసింది. ఆ ప్లాన్ ఏమిటో నాకు తెలీదు. ఒకరోజు వాళ్ళిద్దరూ మా తోటికోడలి దగ్గరకి వెళ్ళారు.

"పిన్నీ మీ అక్క ఈ వూరు ఎప్పుడూ రాలేదా?"

"లేదమ్మా అది ఎప్పుడు రాలేదు."

"మీ అక్క ఎలా వుంటుంది పిన్నీ ? మీలాగే వుంటుందా?"

"అది చాలా బాగుంటుందమ్మా. నాకన్నా బాగుంటుంది. తెల్లగా, చక్కగా వుంటుంది"

"మరి......"

"ఏమిటమ్మా దివ్యా? ఏదో చెప్పడానికి సందేహిస్తున్నట్లున్నావు?"

"ఏం లేదు. మీ అక్క జబ్బు మనిషని, ఒంట్లో బాగుండదని, ఎప్పుడూ మంచం మీద పడుకునే వుంటుందని, ఇంట్లో పనేమీ చెయ్యదని విన్నాం"

లలిత పిల్లలిద్దరి వైపు వింతగా చూసింది.

"ఏమిటి మీరు మాట్లాడుతున్నది? ఎవరు చెప్పారు మీకివన్నీ? ఇంటెడు పనీ అదే చేస్తుంది."

"అబ్బే ఏం లేదు... ఏం లేదు. సరేగాని మీ అక్కని మేం ఎప్పుడూ చూడలేదు. ఒకసారి రమ్మనండి పిన్నీ. దసరా రోజులు మరో వారంలో వస్తున్నాయి. ఇక్కడ దసరా ఉత్సవాలు బాగా జరుగుతాయి. పార్వతీశం అంకుల్ ఎలాగూ ఇక్కడే వున్నారు కదా!"

"అవునమ్మా మీ ఐడియా బాగానే వుంది. ఎన్నాళ్ళయిందో దాన్ని చూసి. రమ్మని పిలుస్తాను. అది తప్పకుండా వస్తుంది" అంది లలిత సంతోషంగా.

లలిత అక్క కామేశ్వరి వూర్నించి వచ్చింది. అంజలి, దివ్య ఆమెని చూడ్డానికి వెళ్ళారు. ఆవిడ తెల్లగా, నాజూగ్గా, అందంగా వుంది.

అంజలి, దివ్య ఆశ్చర్యపోయారు ఆవిడ్ని చూసి.

### జీవన వేదం



**మనిషి సృష్టిస్తున్న మారణహోమం**
**మనుగడను కాల్చివేస్తున్న ఖాండవ దహనం**
**అణగారిన ఆర్తులను పీడించే అశ్వమేధ యాగం**
**అడుగడుగున మనిషిని చంపే శవమేధ యాగం**
**బ్రతుకంతా ప్రతి మనిషికి జీవన ప్రతివాదం**
**ఇదేనా? జీవన వేదం?**

**- పి. జయరామ్**

"మా లలిత పిన్నికి అక్క అంటే మీరు కూడా మాకు పిన్నే కదా!" అది దివ్య సంబరంగా.

"అవునమ్మా" అంది కామేశ్వరి నవ్వుతూ.

"పిన్నీ మీరు చాలా అందంగా వున్నారు" అంది దివ్య.

ఆవిడ హాయిగా నవ్వేసింది.

"పార్వతీశం అంకుల్ మా ఇంటికి రోజూ వస్తూ వుంటారు" ఆవిడ కళ్ళలోకి పరీక్షగా చూస్తూ అంది దివ్య.

"అలాగా? ఆయన చాలా సరదాగా, కలుపుగోరుగా వుంటారు" అందామె.

"పిన్నీ మీరు రేపు సాయంత్రం మా ఇంటికి రావాలి" అంది దివ్య.

"ఎందుకమ్మా? అప్పుడే ఏం తొందర? తర్వాత వస్తాలే" అంది కామేశ్వరి.

"లేదు పిన్నీ మీరెలాగైనా రావాలి. రేపు మీరొక విచిత్రం చూడబోతున్నారు."

"ఏమిటో ఆ విచిత్రం. చలాకైనదానివే. పోనీ నువ్వింతలా చెప్తున్నావు కాబట్టి వస్తానులే" అంది ఆమె వాళ్ళిద్దర్నీ గుమ్మందాకా సాగనంపుతూ.

అంజలి, దివ్య ఇంటికి వస్తూంటే తోవలో పార్వతీశం ఎదురైయ్యాడు. వెతకబోయిన తీగ కాళ్ళకి తగిలినట్టయింది దివ్యకి.

"అంకుల్ రేపు మేం మా ఫ్రెండ్స్‌తో సినిమాకు వెళ్తున్నాం" అంది దివ్య. అతని ముఖంలోని రంగులు మారాయి. అంతటితో వూరుకోలేదు దివ్య.

"అమ్మకి బోరుకొడుతోందిట. మిమ్మల్ని రమ్మంది"

గాలి నింపిన బెలూన్‌లా ఆనందంతో వుబ్బితబ్బిబ్బయిపోయాడు పార్వతీశం.

"అలాగే అలాగే తప్పకుండా మీ అమ్మకి తోడుంటాను. పాపం మీ అమ్మకి ఒక్కర్తీ వుండడానికి భయం కాబోలు." అర్థవంతంగా నవ్వుతూ సంబరపడిపోయాడు. దివ్య ప్లాన్ ప్రకారం అంతా జరిగింది. నేనున్నాననుకుని చాలా ఉత్సాహంగా లోపలికి అడుగుపెట్టాడు పార్వతీశం. "దేవకీ ఈ కిటికీ దగ్గర నించున్నావేం? ఇటు చూడు. నాకు ఎప్పట్నుంచో నీ మీద కోరికగా వుంది. ఇన్నాళ్ళకి నా కోరిక నెరవేరబోతున్నది. మంచి సమయం, పిల్లలు కూడా లేరు. సినిమాకెళ్ళారు. నువ్వు నా కోరిక తీర్చు. మొగుడు పోతేనేం. మిసమిసలాడిపోతున్నావు. నేను చెప్తూనే వున్నాను ఆడదానికి మగ తోడు వుండాలి అని. లేకపోతే జీవితం ఉప్పులేని కూరలా వుంటుంది. ఇన్నాళ్ళకైనా కరుణించావు. మగాడ్ని ఆకర్షించే అవయవసంపద నీలో పుష్టిగా వుంది. నా పెళ్ళాం సన్నగా రివటలా వుంటుంది. దాంతో మాట్లాడ్డానికే చిరాకు నాకు.." ఇంకా ఏదో చెప్పబోతున్నాడు. ఇంతలో కామేశ్వరి సడన్‌గా ముఖం ఇటు తిప్పింది. అంతే పార్వతీశంకి నోట మాట రాలేదు. షాక్ తగిలిన వాడిలా వుండిపోయాడు. తేరుకున్నాక విసవిసా నడుచుకుంటూ బయటకు వెళ్ళిపోయాడు.

కామేశ్వరి నన్ను పట్టుకుని ఏడ్చేసింది.

ఏం చెయ్యాలో, ఏం మాట్లాడాలో తెలియని పరిస్థితి నాది.

మొగుడు లేక నేను బాధపడుతుంటే మొగుడు వుండీ ఆమె బాధపడుతోంది. మా ఇద్దరికీ వ్యత్యాసం ఏమిటి?

ఆడవాళ్ళ జీవితాలు ఇలా మగ్గిపోవల్సిందేనా? చెప్పు కవితా? ఈ సమాజంలో ఆడది మగ తోడు లేకుండా జీవితం సాగించలేదా? ఈ రోజు నాకు అవమానం జరిగింది. రేపు నా కూతుళ్ళకి ఇదే పరిస్థితి ఎదురైతే? మనలో నీతి, నిజాయితీ వున్నా కూడా ఈ సమాజం మనల్ని వంటరిగా బ్రతకనివ్వదెందుకు? మగాడు ఆడదాన్ని తల్లిగానో, చెల్లిగానో ఎందుకు చూడడు?" ఆ పైన మాటలు పెగల్లేదు దేవకికి. వెక్కి వెక్కి ఏడవసాగింది.

"నువ్విలా బాధపడితే ఎలాగే? అసలిప్పుడేం జరిగిందని? పార్వతీశంకి బాగా బుద్ధి వచ్చేలా చేసింది నీ కూతురు దివ్య. దాని ధైర్యానికి మనం మెచ్చుకోవాలి. ఈ కాలం అమ్మాయిలంతా దివ్య లాగ ఆపాటి తెలివితేటలు, సమయస్ఫూర్తి, ధైర్యం కలిగి వుంటే స్త్రీల సమస్యలు కొంతవరకైనా తీరతాయి" అన్నాన్నేను దేవకికి ధైర్యం చెపుతూ. ←